నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, గురువారం 10 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET






జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, హాజరైన పార్టీ శ్రేణులు



పాలమూరులో వాల్ పెయింటింగ్ వేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య

# రజతోత్సాహం



- బీఆర్‌ఎస్ రజతోత్సవానికి సమాయత్తం
- విస్తృతంగా సన్నాహక సమావేశాలు
- వరంగల్ సభకు పార్టీ శ్రేణులను భారీగా తరలించేందుకు ఏర్పాట్లు

## సభను సక్సెస్ చేయాలి

- ప్రజలంతా కేసీఆర్, బీఆర్‌ఎస్ వైపు
- రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య

మహబూ బ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 9 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే బీఆర్‌ఎస్ ఏర్పాటైందని, అదే పార్టీ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటం చేసిన కేసీఆర్.. పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో అగ్ర భాగాన నిలిచిందన్నారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఆకాంక్షల నుంచి పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చూసి ప్రజలు విసిగిపోతు భవిష్యత్తులో కేసీఆర్, బీఆర్‌ఎస్ పాలన కోరుకుంటున్నారన్నారు. మహబూ బ్‌నగర్ ఎంపీగా ఉన్న సమయంలోనే కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మహబూ బ్‌నగర్‌ను విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడం తోపాటు ఉపాధి అవకాశాలు కల్పించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. మిషన్ భగీరథ, రైతు బంధు పథకాలు దేశానికి ఆదర్శంగా నిలి చాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మోస పూరితమైన హామీతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలలో రుణమాఫీ పూర్తిగా లేదని, రైతు బంధు రాలేదని, కల్యాణలక్ష్మి రూ.లక్ష, తులం బంగారుకు దిక్కులేదని, రూ.4 వేల పింఛన్ రాలేదన్నారు. ఆరు గ్యారెంటిల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైదని విమర్శించారు. హెచ్‌సీయూలో 400 ఎకరాల భూమి కబ్జా చేసేందుకు విద్యార్థులపై లాఠీచార్జి చేశారని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చేశారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజాసమస్యలపై బీఆర్‌ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని వెల్లడించారు. అనంతరం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో తెలంగాణ అన్ని రంగాల్లో నష్టపోయిందని, రాజకీయంగానే తెలంగాణ వస్తుందనే ఆలోచనతో బీఆర్‌ఎస్ పెట్టి గాంధేయ పద్ధతిలో పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ సాధించిన తరువాత చరిత్రలో నిచిపోయే విధంగా అభివృద్ధి చేశామన్నారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో బహిరంగసభ పోస్టను అంటించడంతోపాటు వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం సీపీఎం(ఎంఎల్) పార్టీకి చెందిన జిల్లా నాయకుడు అంబదాస్‌తోపాటు పలువురు మాజీ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబదాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో గతంలో మహబూబ్‌నగర్‌లో చేసిన అభివృద్ధి, ప్రస్తుతం రైతులు, ప్రజల పక్షాన చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాల మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, నాయకులు దేవేందర్‌రెడ్డి, సాయిలు యాదవ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, శరత్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి అంబదాస్‌ను ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య యాదవ్

## కాంగ్రెస్, బీజేపీ ఒకటే..

- ఇరు పార్టీల టార్గెట్ కేసీఆరే..
- ఉప ఎన్నికలు రావడం ఖాయం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- గద్వాలలో సన్నాహక సమావేశం

నేడు ఏదులలో సమావేశం

- హాజరుకానున్న నిరంజన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ ఒకే గొడుకు కింద పని చేసే పార్టీలని వారి టార్గెట్ అంతా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ భవన్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు అధ్యక్షతన ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ మోదీ-సోనియా కట్టిన ఇంట్లో కాపురం చేస్తుండగా కేసీఆర్ ఇళ్లు కట్టి కాపురం చేస్తున్నాడని చెప్పారు. రేపటి తరానికి జరిగే మేలు గురించి ఈ సభలో కేసీఆర్ ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఇతర పార్టీలతో మనకు సంబంధం లేదని ప్రతిపక్షాలు సిగ్గుపడేలా తెలంగాణను అభివృద్ధి చేసి చూయించిన గొప్పనాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం కావడంతో కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఉమ్మి వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉపఎన్నికలు రావడం ఖాయమని ప్రస్తుతం ఉప ఎన్నికలు వస్తే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితిలో లేరన్నారు. రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను తిట్టకపోతే ఆయనకు నిద్రరాదన్నారు. రాష్ట్రంలో తెలంగాణకు బలం లేక పోతే కేంద్రమంత్రి తన ప్రతి సమావేశంలో కేసీఆర్‌పై ఎందుకు మాట్లాడుతాడని ప్రశ్నించారు. ప్రజలకు అబద్ధాల హామీలు ఎర వేసి ఓట్లు వేయించుకున్నారని, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమే అన్నారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలం కావడంతో ప్రజలు పార్టీపై ఆక్రోశంతో ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఆ పార్టీకి పరాభవం తప్పదని భావించి ముఖ్యమంత్రి వాటిని వాయిదా వేస్తూ వస్తున్నాడని ఎన్ని వాయిదాలు వేసిన మే లేదా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోతే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు నిలిచి పోతాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గద్వాల కోటపై గులాబీ జెండా ఎగుర వేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. 27న నిర్వహించే సభలో కేసీఆర్ మాటలు విని ప్రతిపక్ష నాయకుల గుండెలు పగిలి పోతాయన్నారు. ఇక్కడ పార్టీ గుర్తుమీద గెలిచిన వాడు పార్టీకి ద్రోహం చేశాడని, ద్రోహం చేసిన వ్యక్తులకు ఉపఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. తెలంగాణను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. భారత చిత్రపటంలో తెలంగాణను నిలిపిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఎవడో బోడిగాడు పార్టీని వదిలి వెళితే మనకు వచ్చిన నష్టం లేదన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అన్నారు. ప్రతి సమావేశంలో పార్టీకి ద్రోహం చేసిన ఎమ్మెల్యే పేరును ఉచ్చరిస్తే మిమ్మల్ని మీరే చిన్నబుచ్చుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఓటు వేసి ప్రజలు బాధపడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేస్తే ఇట్ల మోసం జేస్తదని అనుకోలేదని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. తెలంగాణ సమాజం ఎప్పుడు కాంగ్రెస్‌ను నమ్మవద్దని సూచించారు. తెలంగాణను వ్యతిరేకంగా మాట్లాడిన చంద్రబాబును కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని ఓడించిన చతురత కలిగిన నాయకుడు కేసీఆర్ అన్నారు. కేంద్రంపై ఒత్తిడితెచ్చి తెలంగాణను సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. మోసానికి ఆదిగురువు కాంగ్రెస్ అని మాజీ మంత్రి ఆరోపించారు. 1400మంది ప్రాణాలు బలి తీసుకున్న తర్వాత కాంగ్రెస్ తెలంగాణ ప్రకటన చేసిందని దీనిని తెలంగాణ సమాజం సహించలేక పోతుందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏనాడు ఇక్కడి నాయకులు పార్టీ కోసం పని చేయని వారు ఇప్పుడు ఎగిరెగిరి పడుతున్నారన్నారు. ప్రతిపక్ష హోదాలో కాంగ్రెస్‌ను బీఆర్‌ఎస్ చీల్చి చెండాడుతుందని చెప్పారు. రజతోత్సవ సభకు అన్ని గ్రామాలు, మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని,అందుకోసం నాయకులు,కార్యకర్తలు గ్రామాలు,మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను సమీకరించాలని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నేనుంటానని కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. పార్టీకి కార్యకర్తలే పట్టు గొమ్మలని వారిని కాపాడుకునే బాధ్యత నాదన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గద్వాల ఎమ్మెల్యే అభివృద్ధి కోసం పార్టీ మారాడని చెబుతున్నాడని పార్టీ మారిన తర్వాత ఏం అభివృద్ధి చేశాడో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నేత పదవులు అనుభవించి పార్టీలు మారుతున్నాడని ఆరోపించారు. ఆయన తీరు చూస్తే తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లు ఉందన్నారు. కేసీఆర్ అడగకుండనే ప్రజలకు వరాలు ఇచ్చారని, ముఖ్యమంత్రి రేవంత్ వరాలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్యామల, నేతలు నాగర్ దొడ్డి వెంకట్రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్వ పల్లయ్య, మనోరమ, అతి కుల్ రహేమాన్, మోనేశ్, బీచుపల్లి, చక్రధర్‌రావు, రాజు మాట్లాడారు. కార్యక్రమంలో రాము, మాజ్, శేఖర్ నాయుడు, శ్రీరాములు, తిరుమలేశ్ పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## హామీలను గాలికొదిలేసిన సర్కారు

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- పెంట్లవెల్లిలో పార్టీశ్రేణులతో మీటింగ్

పెంట్ల వెల్లి, ఏప్రిల్ 9 : ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసి అధికాంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను గాలి కొదిలేసిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పెంట్లవెల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పెంట్ల వెల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించి సభను విజయవతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే 100రోజుల్లో ఆ రు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వం ఏర్పడి ఎడాదిన్నర గడిచినా ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. మార్పు, మార్పు అంటూ... రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రాష్ట్రాని నాశనం చేస్తున్నారన్నారు. నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి రైతులను రాజును చేస్తే.. నేడు కాంగ్రెస్ సర్కార్ సంక్షేమ పథకాలను తుంగలో తొక్కిదన్నారు. పైగా ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు రైతులకు బేడీలు వేసి కేడీలను చేసి.. జైలుకు పంపిందన్ని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంట్లవెల్లి సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. ఆగస్టు15 వరకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామని ప్రగాల్బాలు పలికిన సీఎం నేటి వరకు 50శాతం మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతుల వేంకటేశ్వర్లు, విండో చైర్మన్ విజయరామారావు, మండల సీనియర్ నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఎస్‌కే ఖాజా, గోవురాజు, యాగౌస్, బ్రహ్మం, వేంకటేశ్, రామ చందర్, కురుమయ్య, బాల స్వామి, రాము, శేఖర్ తదితరులు ఉన్నారు.

## బీరం వాల్‌రైటింగ్ ప్రారంభం

కొల్లా పూర్ రూరల్, ఏప్రిల్ 9 : వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కొల్లా పూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 27 బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్లో కేసీఆర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరానున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ప్రజలు నేడు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. నేను ఇప్పటి దాకా కొన్ని గ్రామాల్లోకి వెళ్లగా అక్కడ ప్రజలు కేసీఆర్ ఉండగా సాగు నీరు , తాగు నీరు సక్రమంగా ఉండడంతోపాటు 24 గంటలు కరెంట్ ఇచ్చేదని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా వాటిని అమలు చేయడంతో ఘోరంగా విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని, తెలంగాణ రాష్ట్రం అభ్భివృద్ధి, సంక్షేమం జరగాలన్నా ఇంటి పార్టీ మాత్రమే ఉండాలని తెలంగాణ ప్రజలు గుర్తించారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్‌ఎస్‌కు వందశాతం మంచి రోజులు రానున్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలో వివిధ మండలాలో బిఆర్‌ఎస్ పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నాం ప్రతి మండలం, గ్రామం నుంచి భారీ సంఖ్యలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , ఆభిమానులు ,భారీగా తరలి వచ్చి సభ ను విజయవంతంగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి , కాటం జంబులయ్య, కల్లమంద శేఖర్ , ఎండీ రుక్మద్దీన్, నిరంజన్, దార శేఖర్, నాగరాజు, బోరెల్లి కురుమయ్య, కలర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో వాల్‌రైటింగ్ రాస్తున్న బీరం

## బీఆర్‌ఎస్ సభ పోస్టర్లు ఆవిష్కరించిన రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 9 : సింగారం చౌరస్తా వద్ద ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, సకాలంలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



నారాయణపేటలో బీఆర్‌ఎస్ సభ గోడ పత్రిక విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## లింగమయ్యగా కొలువైన శివుడు

### రేపటి నుంచి సలేశ్వరం జాతర



లింగమయ్య స్వామి



లింగమయ్య దర్శనానికి కాలినడకన వెళ్తున్న భక్తులు (ఫైల్)

- ఏడాదికోసారి నల్లమలలో దర్శనం
- 11 నుంచి 13 వరకు ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- రాళ్లు, రప్పల మధ్య 3 కి.మీ. సాహస నడక
- దక్షిణాది అమర్‌నాథ్ యాత్రగా గుర్తింపు

అచ్చంపేట, ఏప్రిల్ 9 : సాహసోపేతమై దక్షిణాది అమర్‌నాథ్ యాత్రగా పేరుగాంచిన సలేశ్వరం జాతరకు వేళైంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దట్టమైన నల్లమల అడవిలోని లింగమయ్య దర్శనానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 11 నుంచి 13 వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉగాది పండుగ తర్వాత తొలి చైత్ర పౌర్ణమికి జాతర జరుగుతుంది. ఈ మూడ్రోజులు ఇక్కడ చెంచులే పూజారులుగా అరుదైన ఉత్సవం జరగనున్నది. తెలంగాణ నుంచే గాక ఏపీ, కర్ణాటక, తమిళనాడు నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. వచ్చే భక్తులు వస్తున్నాం.. లింగమయ్యా.. అంటూ.. తిరిగి వెళ్లే సమయంలో వెళ్తున్నాం.. లింగమయ్యా.. అన్న నినాదాలతో అడవి పులకించనున్నది. ఇక్కడ జలపాతానికి సందర్శకులు, భక్తులు ముగ్ధులు కావాల్సిందే.. ఇక్కడే ఉన్న గుండంలోని నీరు చల్లగా ఉంటుంది. అనేక వనమూలికలతో కలిసిన ఈ నీరు ఆరోగ్యానికి చాలా మంచిందని భక్తులు బాటిళ్లలో నింపుకొని వెళ్తుంటారు. అలాగే కింద ఉన్న గుహలో కూడా లింగమే ఉండగా.. గుడి ముందు మాత్రం వీర భద్రుడు, గంగమ్మ విగ్రహాలున్నాయి. జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆధ్యాత్మిక భావనతో పాటుగా ట్రెక్కింగ్ మాదిరి వేయి అడుగుల లోతుకు కాలినడకన చేరుకునే ఆహ్లాదకర అనుభూతిని ఈ యాత్ర మిగిల్చనున్నది. అయితే ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు.

**ఇలా వెళ్లాలి..**

సలేశ్వరం జాతర.. ఎంతో సహసంతో లింగమయ్య దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. శ్రీశైలం -హైదరాబాద్ వెళ్లే రహదారిలో ఫరహా బాద్ పులి బొమ్మ నుంచి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. దట్ట మైన అడవి మధ్యలో రాళ్లు, రప్పలు, లోయలోకి దిగి వెళ్లాల్సి ఉంటుంది. జాతరకు వెళ్ల డానికి వాహన సౌకర్యం ఉండదు. శ్రీశైలం క్షేత్రానికి 60కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. అడవిలో ఫరహా బాద్ మీదుగా 30 కి.మీ. వాహన ప్రయాణం.. అక్కడి నుంచి 5 కి.మీ. కాలినడకన వెళితే.. అక్కడ లోయలోని గుహలో ఈశ్వరుడు లింగ రూపంలో మనకు దర్శనమిస్తాడు. హైదరాబాద్ నుంచి 130 కి.మీ., మహబూ బ్‌నగర్ నుంచి 100 కి.మీ., నల్లగొండ నుంచి 150 కి.మీ. దూరం ప్రయాణం చేశాక మన్ననూర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి 15 కి.మీ. దూరంలోని ఫరహా బాద్ మీదుగా 30 కి.మీ. వెళ్లాక రాంపూర్ పెంటకు.. అక్కడి నుంచి మరో 2 కి.మీ. ఆటోల ద్వారా.. మరో 2 నుంచి 3 కి.మీ. దూరం కాలినడకన సాహసయాత్ర చేయాల్సి ఉంటుంది. మరో మార్గమైన లింగాల మండలం అప్పాయిపల్లి మీదుగా కూడా ట్రాక్టర్లు, కాలినడకనతో సలేశ్వరం చేరుకోవచ్చు. ఎమరుపాటుగా కాలు జారితే ఇక లోయలో పడిపోవాల్సిందే.

### మూడ్రోజులే అనుమతి

**-డీఎఫ్‌వో రోహిత్ గోపిడి**

సలేశ్వరం జాతరకు 11 నుంచి 13వ తేదీ వరకు మూడ్రోజులే అనుమతి ఉంటుంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫరహాబాద్ నుంచి అనుమతి ఇస్తాం. పార్కింగ్ పుల్లాయపల్లి వద్దనే పోలీసులు ఆపేస్తారు. అక్కడి నుంచి రాంపూర్ వరకు ఆటోలు, జీపుల్లో వెళ్లాలి. వచ్చే భక్తులు అటవీ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకం, బీడీ, చుట్ట, సిగరేట్ కాల్చడం నిషేధం. అనారోగ్యంతో బాధపడేవారు, వృద్ధులు, బాలింతలు, చిన్నారులు దూరంగా ఉండాలి. భక్తుల సౌకర్యార్థం 450 మంది సిబ్బంది, వలంటీర్లను ట్రాఫిక్ నియంత్రణ, టోల్‌గేట్ వద్ద, చెత్త సేకరణ కోసం నియమించాం. అత్యవసర అంబులెన్స్‌కు ప్రత్యేక దారిని ఏర్పాటు చేశాం. 2 లీటర్ల వాటర్ బాటిల్స్‌కు అనుమతి.. లీటర్ బాటిళ్లకు లేదు.

### మందు, మటన్ తినొస్తే తేనె టీగలు పసిగడ్తాయి

**– గురువయ్య, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి**

జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. మా తాతాల కాలం నుంచి ఆదివాసిలే ఇక్కడ పూజారులుగా వ్యవహరిస్తారు. రాంపూర్, అప్పాపూర్, భౌరా పూర్, ఆగర్లపెంటలకు చెందిన వారు పూజారులు.. లింగమయ్యకు ఇప్పపూలు, తేనే నైవేద్యంగా సమర్పిస్తాం. స్వామి దర్శనం కోసం భక్తిశ్రద్ధలతో రావాలి. ఎవరైనా మటన్, మందు తాగి వస్తే తేనెటీగలు వాసన పసిగట్టి దాడిచేస్తాయి. భక్తులు అలర్ట్‌గా ఉండాలి.. గుండంలోపల జనరేటర్ ద్వారా లైట్లు ఏర్పాటు చేశాం. గజ ఈతగాళ్లు ఉందుబాటులో ఉన్నారు. మొకాల కుర్వ నుంచి కొద్దిదూరం రోడ్డు సరిచేశాం. ఆలయ కమిటీ నుంచి 11రోజులు జాతర కోసం అనుమతి అడిగాం.. కానీ మూడ్రోజులు మాత్రమే ఇచ్చారు. పూజారుల కోసం అన్న దానం ఏర్పాటు చేస్తాం.

## ఇంటి పండుగలా తరలిరావాలి

- బీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : ఇంటి పండుగలా బీఆర్‌ఎస్ రజ తోత్సవ సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మెట్టుపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. 14 ఏండ్ల ఉద్యమ చరిత్ర అనంతరం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో పదేండ్లు ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. కానీ తర్వాత మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫల మైందని దుయ్యబట్టారు. ప్రధానంగా కరెంట్ సమస్యలు, రైతు భరోసా, రైతు రుణ మాఫీ, బీమా వంటి పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చినా ఒక్కటీ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, విద్యార్థులకు విద్యా భరోసా, స్కూటీల పంపిణీ వంటి పథకాలను తుంగలో తొక్కి ప్రజలను హరిగోస పట్టిస్తుందని ధ్వజమెత్తారు. అందుకే ప్రభుత్వం మెడలు వంచి హామీలు అమలు చేసేవరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కురుమూర్తి యాదవ్, నందిమల్ల అశోక్, పరం జ్యోతి, గులాం ఖాదర్ ఖాన్ బండారు కృష్ణ, కంచె రవి, తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రైతుల పడిగాపులు

అమరచింత, ఏప్రిల్ 9 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద పంటలు సాగు చేసిన రైతులు నీరు పారబెట్టుకునేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా కాల్వల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఆత్మకూర్ మండలంలోని జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లి, ఆరెపల్లి, కత్తెపల్లి, మూలమల్ల, అమరచింత మండలంలోని నందిమల్ల, కిష్టంపల్లి తదితర గ్రామాల్లోని రైతులు వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, వారబంధీ లెక్కన వారంలో నాలుగు రోజులు సాగునీరు విడుదల చేస్తున్నారు. అధికారులు మంగళవారం రాత్రి సాగునీటిని విడుదల చేయవలసి ఉండగా, జూరాల ఎడమ కాల్వతోపాటు డీ-6 జూరాల గ్రామ శివారులో ఉన్న డీ 6 కెనాల్ వద్ద బుధవారం ఉదయం సాగునీటి కోసం పడిగాపులు కాయగా, వస్తున్న కొద్దిపాటి సాగునీరు తమ పంట పొలాలకు పారబెట్టేందుకు కట్టలు వేసుకోవాలని రైతులు చర్చించుకోవడం కనిపించింది. పంటలకు ఇంకా రెండు తడులు అందితేనే పూర్తి స్థాయిలో రైతులకు పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని పంటలకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



డీ- 6 కాల్వ వద్ద సాగునీటి విడుదల కోసం రైతుల నిరీక్షణ